

## ఈ-కేవైసీ వేగవంతం చేయండి

ఈ- క్రాప్ పూర్తి చేసుకున్న రైతుల ఈ-కేవైసీ వేగవంతం చేసి రెండు, మూడు రోజుల్లో పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు సిబ్బందిని ఆదేశించారు. 8లో



## కిలో టమాట రూ.46

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.46, కనిష్టంగా రూ.30, సరాసరిన 38 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
33.8°/23.2°

జిల్లా పరిధిలో శుక్రవారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

# అంగన్‌వాడీ.. పర్యవేక్షణేదీ!

- ఐసీడీఎస్‌లో సూపర్‌వైజర్ల కొరత
- జిల్లాలో 56 పోస్టులు ఖాళీ
- ఉన్నవారిపై పనిభారంతో సతమతం
- వివిధ కార్యక్రమాల అమలుకు ఆటంకం
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

**మడకశిర:** ఐసీడీఎస్ (ఇంటిగ్రేటెడ్ చైల్డ్ డెవలప్‌మెంట్ సర్వీస్ స్కీం) ప్రాజెక్టుల్లో కీలకమైన సూపర్‌వైజర్ల కొరత వేధిస్తోంది. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ అంతంతమాత్రంగా సాగుతోంది. జిల్లాలో మడకశిర, గుడిబండ, బత్తలపల్లి, సోమందేపల్లి, ఓడీసీ, నల్లచెరువు, కదిరి, ధర్మవరం, హిందూపురం, పెనుకొండ, చెన్నేకొత్తపల్లి, పుట్టపర్తి కేంద్రాలుగా 12 ప్రాజెక్టులు ఉండగా, వాటి పరిధిలో 2,824 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఈ కేంద్రాల పర్యవేక్షణకు 113 మంది సూపర్‌వైజర్లు ఉండాలి. ప్రస్తుతం 57 మంది మాత్రమే పని చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 56 సూపర్ వైజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణ ఆశించిన స్థాయిలో జరగడం లేదు.

**పనిభారంతో సతమతం..**

జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాజెక్టుల పరిధిలో 56 సూపర్‌వైజర్ పోస్టులు ఖాళీగా ఉండగా.. ఉన్నవారిపై పని భారం పెరిగింది. దీంతో ఒక్కో సెక్టార్‌ను పర్యవేక్షించాల్సిన సూపర్‌వైజర్ ప్రస్తుతం రెండు, మూడు సెక్టార్లను పర్యవేక్షించాల్సి వస్తోంది. ఒక్కో సెక్టార్‌లో 40 నుంచి 50 వరకు అంగన్‌వాడీ కేంద్రాలు ఉంటాయి. ఇలా రెండు, మూడు సెక్టార్లలోని 100 నుంచి 150 అంగన్‌వాడీ కేంద్రాలను ఒక సూపర్‌వైజర్ పర్యవేక్షించడం చాలా కష్టతరంగా మారింది.





ఇది మడకశిర ఐసీడీఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం. ప్రాజెక్ట్ పరిధిలో 269 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. వాటిని 10 సెక్టార్లుగా విభజించారు. నిబంధనల మేరకు ఒక్కో సెక్టార్‌కు ఒకరు చొప్పున 10 మంది సూపర్‌వైజర్లు ఉండాలి. కానీ ముగ్గురు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. మొత్తం పది సెక్టార్ల బాధ్యతలు ముగ్గురే చూడాల్సి రావడంతో పనిభారం పెరిగి ఎక్కడా పనిచేయలేని పరిస్థితి నెలకొంది.

**18 పోస్టుల్లో 14 ఖాళీ..**

జిల్లాలోని 12 ప్రాజెక్టుల పరిధిలో సూపర్‌వైజర్ల కొరత ఉంది. ప్రధానంగా జిల్లాలో మడకశిర, గుడిబండ ప్రాజెక్టులు కర్ణాటక సరిహద్దులో ఉన్నాయి. ఈ రెండు ప్రాజెక్టుల పరిధిలో 438 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఇందులో మడకశిర ప్రాజెక్ట్ పరిధిలో 269, గుడిబండ ప్రాజెక్ట్ పరిధిలో 169 అంగన్‌వాడీ కేంద్రాలున్నాయి. ఈ రెండు ప్రాజెక్టుల్లో 18 సెక్టార్లున్నాయి. నిబంధనల మేరకు 18 మంది ఉండాలి. కానీ కేవలం నలుగురు మాత్రమే పనిచేస్తున్నారు. 14 సూపర్‌వైజర్ల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇలా జిల్లాలోని మిగిలిన ఐసీడీఎస్ ప్రాజెక్టుల పరిధిలో కూడా సూపర్‌వైజర్ల కొరత పట్టి పీడిస్తోంది.

**పట్టించుకోని కూటమి ప్రభుత్వం..**

గర్భిణులు, బాలింతలు, ఆరేళ్లలోపు వయసున్న చిన్నారులకు పౌష్టికాహారం అందించడం, ప్రీ ప్రైమరీ విద్య, ఇమ్యునైజేషన్, చిన్నారుల పోషణ, ఆరోగ్యం, పిల్లల ఎదుగుదల విటమిన్ లోపం నివారించడం తదితర కార్యక్రమాలన్నీ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారానే అమలు కావాల్సి ఉంది. ఈ కార్యక్రమాలు వంద శాతం విజయవంతం కావాలంటే వీటిని పర్యవేక్షించాల్సిన సూపర్ వైజర్లు పూర్తి స్థాయిలో ఉంటేనే సాధ్యమవుతుంది. ఈ విషయాన్ని కూటమి ప్రభుత్వం గుర్తించడం లేదని ప్రజలు వాపోతున్నారు. జిల్లాలో ఇద్దరు మంత్రులున్నా.. ప్రయోజనం లేకుండా పోయిందని వాపోతున్నారు.

| | |
|---|---|
| 2,824 | జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల సంఖ్య |
| 12 | ఐసీడీఎస్ ప్రాజెక్టుల సంఖ్య |
| 113 | ఉండాల్సిన ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు |
| 57 | ప్రస్తుతం ఉన్న ఐసీడీఎస్ సూపర్ వైజర్ల సంఖ్య |
| 56 | ఖాళీగా ఉన్న ఐసీడీఎస్ సూపర్ వైజర్ పోస్టులు |

### సర్దుబాటు చేశాం



జిల్లాలో 56 సూపర్‌వైజర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. దీంతో ఉన్న వారికే సర్దుబాటు చేసి అంగన్‌వాడీ కేంద్రాలను పర్యవేక్షిస్తున్నాం. ఐసీడీఎస్ పరిధిలో అమలు చేయాల్సిన పథకాలన్నీ పక్కా నిర్వహిస్తున్నాం. అంగన్‌వాడీ కేంద్రాల పర్యవేక్షణలోనూ ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నాం. ప్రభుత్వం త్వరలోనే సూపర్‌వైజర్ పోస్టులను భర్తీ చేసే అవకాశం ఉంది.

– నాగమల్లేశ్వరి, ఇన్‌చార్జ్ పీడీ, ఐసీడీఎస్

## న్యూస్‌రీల్

### పెనుకొండ ఆర్డీఓగా ఆనంద్‌కుమార్



ఆర్డీఓ ఆనంద్‌కుమార్

**పెనుకొండ:** పెనుకొండ ఆర్డీఓగా ఆనంద్‌కుమార్ నియమితులయ్యారు. ప్రస్తుతం చిలమత్తూరు తహసీల్దార్‌గా ఉన్న ఆయనకు ప్రభుత్వం పదోన్నతి కల్పించి ఆర్డీఓగా నియమించింది. ఆనంద్‌కుమార్ ఉమ్మడి అనంతపురం జిల్లాలోని వివిధ మండలాల్లో తహసీల్దార్‌గా విధులు నిర్వర్తించారు. శుక్రవారం ఆయన చేనేత, జౌళి శాఖ మంత్రి సవితను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆర్డీఓ కార్యాలయ అధికారులు, సిబ్బంది ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రెండు, మూడు రోజుల్లో ఆనంద్‌కుమార్ ఆర్డీఓగా బాధ్యతలు స్వీకరించనున్నట్లు తెలిసింది.

### తగ్గిన ఎండు మిర్చి ధర



హిందూపురం మార్కెట్‌కు వచ్చిన ఎండు మిర్చి

**హిందూపురం అర్బన్:** ఎండుమిర్చి ధర తగ్గింది. శుక్రవారం మార్కెట్‌కు 167 క్వింటాళ్ల ఎండు మిర్చి రాగా, మొదటి రకం మిర్చి క్వింటా రూ.18,500, రెండో రకం రూ.8 వేలు, మూడో రకం మిర్చి క్వింటా రూ.7 వేలు పలికినట్లు మార్కెట్ కార్యదర్శి జి. చంద్రమౌళి తెలిపారు. రైతులు నాణ్యమైన ఎండుమిర్చి తీసుకువచ్చి మంచి ధరలు పొందాలని సూచించారు.

### నేడు ఆలయాల్లో వైఎస్సార్ సీపీ పూజలు

- శ్రేణులంతా పాల్గొనాలని పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ పిలుపు



ఉషశ్రీచరణ్

**పెనుకొండ:** తిరుమల పవిత్రతను, లడ్డూ ప్రసాదం విశిష్టతను చంద్రబాబు అపహాస్యం చేశారని, ఆయన చేసిన పాపాన్ని ప్రక్షాళన చేసేందుకు శనివారం వైఎస్సార్ సీపీ జిల్లా వ్యాప్తంగా ఎక్కడికక్కడ ఆలయాల్లో పూజలు చేస్తోంది. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లోని పార్టీ నేతలంతా ఆలయాల్లో పూజలు చేసి చంద్రబాబు చేసిన మహా అపరాధాన్ని క్షమించాలని ఆ దేవదేవుడిని వేడుకుందామని ఆ పార్టీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ పిలుపునిచ్చారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చలేని చంద్రబాబు...ప్రజల దృష్టిని మళ్లించేందుకు ఏకంగా వెంకటేశ్వరస్వామి ప్రసాదాన్ని తెరపైకి తేవడం దురదృష్టకరమన్నారు. ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న వ్యక్తి ప్రజల మనోభావాలతో చెలగాటమాడడం తగదన్నారు.

### 'ఎన్‌ఎంఎంఎస్' దరఖాస్తు గడువు పొడిగింపు

**పుట్టపర్తి:** ఈ ఏడాది డిసెంబరు 8న జరగనున్న నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్‌ఎంఎంఎస్) పరీక్షకు దరఖాస్తు చేసుకునేందుకు మరో మారు గడువు పెంచారు. అక్టోబర్ మూడో తేదీ వరకు దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించారు. ఈ అవకాశాన్ని జిల్లాలో ప్రభుత్వ, జిల్లా పరిషత్, మునిసిపల్, ఎయిడెడ్, మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలు, వసతి సౌకర్యం లేని మోడల్ స్కూళ్లలో ప్రస్తుతం 8వ తరగతి చదువుతున్న విద్యార్థులందరూ సద్వినియోగం చేసుకోవాలని విద్యాశాఖ అధికారులు సూచించారు. www.bse.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. కుటుంబ సంవత్సరాదాయం రూ.3,50,000 లోపు ఉన్న విద్యార్థులు ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష రాసేందుకు అర్హులని పేర్కొన్నారు. ఆన్‌లైన్ నమోదు సమయంలో విద్యార్థి ఆధార్‌లో ఉన్న విధంగానే పేరు నమోదు చేయాలని, దరఖాస్తు సమయంలో ఎలాంటి ధ్రువపత్రాలు అవసరం లేదు అని స్పష్టం చేశారు. ఓసీ, బీసీ విద్యార్థులు రూ.100, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు రూ.50 చెల్లించాల్సి ఉంటుందని వెల్లడించారు.

## పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి చర్యలు





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ టీఎస్ చేతన్





సాంస్కృతిక ప్రదర్శన

- కలెక్టర్ టీఎస్ చేతన్
- దసరా సెలవుల్లో జిల్లాలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించాలని సూచన

**పుట్టపర్తి టౌన్:** ప్రపంచ ప్రఖ్యాత గాంచిన లేపాక్షి, తిమ్మమ్మ మర్రిమాను, వేమన సమాధి, శిల్పకళా వైభవాన్ని చాటే కోటలు, విజయనగర రాజుల సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే కట్టడాలు జిల్లాలో ఎన్నో ఉన్నాయని, వాటన్నింటినీ పర్యాటకంగా అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర్ టీఎస్ చేతన్ తెలిపారు. శుక్రవారం ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని పర్యాటక శాఖ ఆధ్వర్యంలో పుట్టపర్తి సాయిఆరామంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పర్యాటక శాఖ జిల్లా అధికారి జయకుమార్ బాబు అధ్యక్షతన సమావేశంలో కలెక్టర్ టీఎస్ చేతన్ మాట్లాడారు. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని 14 ప్రదేశాలను రూ.14.61 కోట్లతో అభివృద్ధి చేశామన్నారు. చరిత్ర, సంస్కృతి, సాంప్రదాయాలను ప్రతిబింబించే దర్శనీయ ప్రదేశాలు జిల్లాలో చాలా ఉన్నాయని, వాటిని దర్శించేందుకు కర్ణాటక, తమిళనాడు తదితర రాష్ట్రాల నుంచి పర్యాటకులు వస్తుంటారన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో పర్యాటక ప్రాంతాలను మరింత అభివృద్ధి చేసేందుకు తగు చర్యలు తీసుకుంటామన్నారు. లేపాక్షికి యునెస్కో గుర్తింపు దక్కడానికి ప్రయత్నాలు జరుగుతున్నట్లు వెల్లడించారు. దసరా సెలవుల్లో జిల్లాలోని పర్యాటక ప్రదేశాలన్నీ సందర్శించాలని విద్యార్థులకు ఆయన సూచించారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, పర్యాటక కౌన్సిల్ సభ్యులు పద్మనాభం, జ్యోతికేశవ, పర్యాటక శాఖ జిల్లా మేనేజర్ ప్రతాప్‌రెడ్డి, శిల్పారామం అధికారి రమేష్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

## 'నవోదయ' దరఖాస్తు గడువు 7వరకు పొడిగింపు

**లేపాక్షి:** జవహర్ నవోదయ పాఠశాలలో 2025–26 విద్యా సంవత్సరంలో ఆరో తరగతి ప్రవేశానికి నిర్వహించే పరీక్షకోసం దరఖాస్తు గడువు అక్టోబరు 7 వరకు పొడిగించారు. www. navodaya.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని విద్యాశాఖ అధికారి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం 5వ తరగతి చదవుతున్న విద్యార్థులు మాత్రమే అర్హులని పేర్కొన్నారు. జిల్లా వాసులకు మాత్రమే అవకాశం అన్నారు. హెచ్‌ఎం/ ప్రిన్సిపాల్ జారీ చేసిన స్టడీ సర్టిఫికెట్లు అప్‌లోడ్ చేయాల్సి ఉంటుందని తెలిపారు. నిబంధనల ప్రకారం వివిధ కేటగిరీల్లో రిజర్వేషన్లు ఉంటాయన్నారు.

## ఇక తాగినోళ్లకు తాగినంత!

- జిల్లాలో 69 మద్యం దుకాణాలకు అనుమతి
- అందులో నాలుగు కల్లు గీత కార్మికులకు
- ఉదయం 10 నుంచి రాత్రి 10 వరకు మద్యం అమ్మకాలు

**హిందూపురం అర్బన్:** రాష్ట్రంలో నూతన మద్యం పాలసీ అమలు దిశగా చర్యలు తీసుకుంటున్న కూటమి ప్రభుత్వం .. క్యాబినెట్ సబ్ కమిటీ నివేదిక మేరకు మద్యం దుకాణాల ఏర్పాటుపై ఒక నిర్ణయానికి వచ్చింది. వివిధ రాష్ట్రాల్లో మద్యం అమ్మకాల తీరు.. వివిధ వర్గాల అభిప్రాయాలు తీసుకున్నామని ప్రభుత్వ పెద్దలు చెబుతున్నా... చివరకు సిండికేట్‌కే మొగ్గు చూపారు. మొత్తం దుకాణాలన్నీ ప్రైవేటుకు కట్టబెట్టి తాగినోళ్లకు తాగినంత మద్యం అందుబాటులోకి తెస్తున్నారు.

**ప్రభుత్వ దుకాణాలన్నీ క్లోజ్..**

ప్రస్తుతం ప్రభుత్వం ఆధ్వర్యంలో నడుస్తున్న మద్యం దుకాణాలన్నింటినీ ప్రభుత్వం రద్దు చేసింది. కొత్తగా జిల్లాలో 69 దుకాణాలకు అనుమతులు ఇచ్చింది. ఇందులో 65 అన్‌రిజర్వుడ్ కాగా.. నాలుగు దుకాణాలను గౌడ, కల్లుగీత కార్మికులకు కేటాయించింది. మద్యం దుకాణాలు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 10 గంటల వరకు తెరిచి ఉంచేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.



**దరఖాస్తు ఫీజు రూ.2 లక్షలు..**

మద్యం దుకాణాలను లాటరీ పద్ధతిలో కేటాయించనున్నారు. ఇందుకోసం ముందుగా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఇందుకు రూ.2 లక్షలు ఫీజు చెల్లించేలా నిబంధన విధించారు. ఈ మొత్తం దుకాణం దక్కినా, దక్కకపోయినా వెనక్కు ఇవ్వరు. ఎన్ని దుకాణాలకు టెండర్ వేయాలంటే అన్ని దరఖాస్తులు సమర్పించాల్సి ఉంటుంది. ఈ లెక్కన ఒక్కో దుకాణానికి 10 నుంచి 20 వరకు దరఖాస్తులు వస్తాయని అంచనా. ప్రధాన కూడళ్లు, వ్యాపారం బాగా జరిగే ప్రాంతాల్లో దరఖాస్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంటుంది. ఈ లెక్కన దరఖాస్తు రూపంలోనే ప్రభుత్వానికి భారీగా సమకూరనుంది.

**జనాభా ప్రాతిపదికన లైసెన్స్ ఫీజు..**

లాటరీలో దుకాణం దక్కితే లైసెన్స్ ఫీజు రూపంలోనూ పిండేసేందుకు ప్రభుత్వ పెద్దలు సిద్ధమయ్యారు. ఇందుకోసం దుకాణం ఏర్పాటు చేసే ప్రాంతాన్ని బట్టి ఫీజు నిర్ణయించారు. లైసెన్స్ గడువు రెండేళ్లు కాగా, పది వేల జనాభా ఉన్న ప్రాంతాల్లో అయితే రూ. 50 లక్షలు, 10 వేల నుంచి 50 వేల వరకు జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.55 లక్షలు, 50 వేల నుంచి 5 లక్షల వరకు జనాభా ఉన్న ప్రాంతాల్లో రూ.65 లక్షలు, 5 లక్షల జనాభా దాటిన ప్రాంతాల్లో రూ.85 లక్షలు లైసెన్స్ ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. హిందూపురం పట్టణం, మండలంలో 6 దుకాణాలు ఏర్పాటు కానుండగా, ఒక్కో దుకాణానికి 20కిపైగా దరఖాస్తులు దాఖలయ్యే అవకాశం ఉంది. ఇక కదిరి, ధర్మవరం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గాల్లోనూ ఈ సారి దుకాణాలు దక్కించుకొనేందుకు కొందరు ఇప్పటికే నగదు సిద్ధం చేసుకుంటున్నారు. ఇంత భారీ మొత్తం చెల్లించి మద్యం దుకాణం దక్కించుకునే వారు అంతకంటే ఎక్కువ సంపాదించేందుకు ప్రయత్నిస్తారని, ఈ క్రమంలో వ్యాపారులంతా సిండికేట్‌గా మారి బాటిల్ ధరపై అదనంగా వసూలు చేసే అవకాశాలు లేకపోలేదని జనం అనుకుంటున్నారు.

**టెండర్ వేశారో జాగ్రత్త..**

మద్యం అమ్మకాలు దక్కించుకునేందుకు కూటమి నాయకులు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ క్రమంలో టెండర్ వేయాలనుకునే వారిని బహిరంగంగానే బెదిరిస్తున్నట్లు తెలుస్తోంది. తమను కాదని టెండర్ వేసి దుకాణం దక్కించుకున్నా వ్యాపారం చేసుకోలేరంటూ హెచ్చరిస్తున్నట్లు సమాచారం. ఇక గౌడ సామాజిక వర్గీయులకు కేటాయించిన దుకాణాలపైనా కొందరు కన్నేశారు. జిల్లాలో నాలుగు దుకాణాలు ఆ సామాజిక వర్గానికి కేటాయించగా.. బినామీలను పెట్టి దుకాణాలు దక్కించుకొనేందుకు ప్రయత్నిస్తున్నారు.

## క్లుప్తంగా

### జీఎంసీలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి తనిఖీలు




రక్షణ చట్టాలపై అవగాహన కల్పిస్తున్న న్యాయమూర్తి శివప్రసాద్‌యాదవ్

**అనంతపురం మెడికల్:** ప్రభుత్వ వైద్య కళాశాల (జీఎంసీ)ని శుక్రవారం ఉదయం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ (డీఎల్ఎస్ఏ) కార్యదర్శి జి.శివప్రసాద్‌యాదవ్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు చేపట్టిన ఈ తనిఖీల్లో కళాశాల విద్యార్థులతో ఆయన మాట్లాడారు. వేధింపులపై డీఎల్ఎస్ఏ ద్వారా అందించే సాయంతో పాటు, రక్షణ చట్టాలపై అవగాహన కల్పించారు. కళాశాలలో వేధింపులు, ఇతర సమస్యలు ఉంటే నిర్భయంగా తెలపాలన్నారు.

### చిన్నారిపై కుక్కల దాడి

**గుత్తి:** స్థానిక ఆర్ఎస్‌లోని రామాలయం వీధిలో ఐదేళ్ల చిన్నారిపై కుక్కలు దాడి చేసి గాయపరిచాయి. వంకగడ్డ వీధికి చెందిన ప్రసాద్, భారతి దంపతుల కుమార్తె రోష్ని... శుక్రవారం ఉదయం రామాలయం వీధిలో ట్యూషన్‌కు వెళుతున్న సమయంలో కుక్కలు దాడి చేశాయి. స్థానికులు అప్రమత్తమై బాలికను కాపాడి, ఆస్పత్రికి చేర్చారు. చికిత్స అనంతరం చిన్నారిని తల్లిదండ్రులు ఇంటికి పిలుచుకెళ్లారు.

### యువతి మృతదేహం లభ్యం



ఇందుప్రియ (ఫైల్)

**బొమ్మనహాళ్:** హెచ్చెల్సీ గల్లంతైన కర్ణాటకలోని బళ్లారికి చెందిన ఇందుప్రియ (25) మృతదేహం బొమ్మనహాళ్ సరిహద్దులో గురువారం రాత్రి తేలింది. బళ్లారి రూరల్ పోలీసులు తెలిపిన మేరకు... ఇందుప్రియా మంగళవారం అదృశ్యమైనట్లు బళ్లారిలోని మహిళా పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు అందింది. విచారణలో బండట్టిలోని హెచ్చెల్సీలో పడినట్లుగా గుర్తించారు. అప్పటి నుంచి గాలింపు కొనసాగుతూ వచ్చింది. మృతురాలి తండ్రి ఎర్రిస్వామి ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

### వృద్ధురాలి బలవన్మరణం



మృతురాలు సరిత

**అనంతపురం:** ఆత్మహత్యాయత్నం చేసిన రుద్రంపేటకు చెందిన సరిత కుళ్లాయమ్మ (75) శుక్రవారం మధ్యాహ్నం మృతి చెందింది. గురువారం సాయంత్రం ఆమె యాసిడ్ తాగింది. గమనించిన కుటుంబసభ్యులు వెంటనే జీజీహెచ్‌కు తరలించారు. చికిత్సకు స్పందించక శుక్రవారం ఆమె మృతి చెందింది. ఘటనపై నాల్గో పట్టణ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# పగబట్టిన విధి

రెక్కాడితే గాని డొక్కాడని నిరుపేద కుటుంబంపై విధి పగ బట్టింది. ఆ కుటుంబాన్ని పక్షవాతం రూపంలో అవస్థ పెడుతోంది. ఎదురొడ్డి నిలబడదామనుకునే లోపు ఒకరి తర్వాత ఒకరు చొప్పున ముగ్గురినీ మంచాన పడేసింది. కుటుంబ బండి ముందుకు సాగక ఆగిపోయింది. కనీస వైద్య చికిత్సలు సైతం అందుకోలేక విలవిల్లాడుతున్న ఆ కుటుంబ దీనస్థితిపై 'సాక్షి' కథనం. –యాడికి

- కుటుంబమంతా మంచానికే పరిమితం
- 12 ఏళ్ల క్రితం అత్త, 8 ఏళ్ల క్రితం భర్త, ప్రస్తుతం కోడలు...
- ఒకే ఇంట్లో ముగ్గురికి పక్షవాతం
- పూట గడవక ఇబ్బందులు
- ఆకలి, దప్పికలు తీరుస్తున్న 'అగాపే'

యాడికిలోని ఆస్పత్రి కాలనీలో నివాసముంటున్న నాగమ్మ, వెంకటదాసు దంపతులకు ఒక్కగానొక్క కుమారుడు నాగరాజు ఉన్నాడు. నేత పనులతో జీవనం సాగిస్తున్న వీరికి సొంత ఆస్తిపాస్తులంటూ ఏమీ లేవు. ఆస్పత్రి కాలనీలో ఓ చిన్న పాటి గదిని అద్దెకు తీసుకుని అందులోనే కాలం నెట్టుకొస్తున్నారు. బాడుగ మగ్గం ఏర్పాటు చేసుకుని కుటుంబాన్ని పోషిస్తున్న వెంకటదాసు దాదాపు 20 ఏళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. అప్పటి నుంచి కుటుంబ బాగోగులు నాగమ్మపై పడ్డాయి. బాడుగ మగ్గంపై చీరలు నేస్తూ వచ్చే అరకొర సంపాదనతోనే కుమారుడిని పెంచి పెద్ద చేసి పెళ్లి చేసింది. ముగ్గురూ కలసి అద్దె మగ్గంపై చేనేత ఉత్పత్తులను నేస్తూ ఎలాంటి ఒడిదుడుకులు లేకుండా సాఫీగా జీవనం సాగిస్తున్న తరుణంలో 2012న నాగమ్మకు పక్షవాతం సోకి మంచాన పడింది.

**సరిగ్గా నాలుగేళ్లు తిరగకనే మరొకరికి**

12 ఏళ్ల క్రితం పక్షవాతం సోకిన నాగమ్మకు కాలు, చెయ్యి పడిపోయింది. నోట మాటరాలేదు. దీంతో ఆమెను నంద్యాల జిల్లా గుండుపాపల గ్రామానికి కుమారుడు నాగరాజు పిలుచుకెళ్లి నాటు వైద్యం చేయించాడు. చికిత్స చేయించిన రెండేళ్ల తర్వాత నాగమ్మకు చెయ్యి మాత్రమే పనిచేయడం మొదలైంది. అయితే కాలు పనిచేయడం లేదు. దీంతో కదల్లేక ఒకే చోట ఉండిపోతోంది. మాట కూడా రాలేదు. నాగరాజు, నారాయణమ్మ దంపతులు మగ్గం నేస్తూ నాగమ్మకు ఏ లోటు రానివ్వకుండా చూస్తూ వచ్చారు. తల్లి మంచాన పడి నాలుగేళ్లు తిరగకనే 2016లో విధి మరోసారి వక్రీకరించడంతో పక్షవాతం సోకి నాగరాజు మంచాన పడ్డాడు. దీంతో బంధువుల సాయం తీసుకుని భర్తను గుండుపాపల గ్రామానికి నారాయణమ్మ పిలుచుకెళ్లి చికిత్స చేయించింది. అయినా ఫలితం దక్కలేదు. చెయ్యి, నోరు పడిపోయింది. ఓ కాలు కూడా సక్రమంగా పనిచేయడం లేదు. దీంతో నాగరాజు సైతం ఇంటికే పరిమితమయ్యాడు.

**ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తూ...**

ఓ వైపు అత్త... మరో వైపు భర్త... పక్షవాతం బారిన పడి మంచాన పడడంతో ఒక్కసారిగా ఆ ఇంటి కోడలు నారాయణమ్మకు దిక్కుతోచలేదు. తమ జీవితాలతో ఆడుకుంటున్న విధాతపై ఆత్మస్థైర్యంతో ఒంటరిపోరుకు సిద్ధమైంది. ఓ వైపు మగ్గం పని చేసుకుంటూనే మరో వైపు అత్తకు, భర్తకు సపర్యలు చేస్తూ వచ్చింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటి వద్దకెళ్లిన వలంటీర్ అక్కడి పరిస్థితిని గమనించి వెంటనే సచివాలయ ఉద్యోగుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో నాగమ్మకు వృద్ధాప్య పింఛన్, నాగరాజుకు చేనేత పింఛన్ మంజూరైంది. ఇది నారాయణమ్మకు కొండంత ధైర్యాన్ని అందించింది. పింఛన్ సొమ్ము మొత్తాన్ని అత్త, భర్త వైద్య ఖర్చులకే వెచ్చిస్తూ వచ్చింది. ఇలాంటి తరుణంలో ఆమె ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీస్తూ విధి మరోసారి వెక్కిరించింది. మూడు వారాల క్రితం పక్షవాతం సోకి నారాయణమ్మ మంచాన పడింది.



పక్షవాతంతో బాధపడుతున్న ముగ్గురికీ అన్నం తినిపిస్తున్న ప్రసాద్

**సొంత పనులూ చేసుకోలేక**

నారాయణమ్మ దుస్థితిని చుట్టుపక్కల వారి నుంచి తెలుసుకున్న దూరపు బంధువు రామకృష్ణ వెంటనే స్పందించారు. నారాయణమ్మను గుండుపాపల గ్రామానికి పిలుచుకెళ్లి చికిత్స చేయించుకుని వచ్చాడు. చికిత్స అనంతరం నోట మాట వచ్చింది కానీ, కాలు, చెయ్యి పనిచేయక పోవడంతో నారాయణమ్మ కూడా మంచానికే పరిమితమైంది. మాట రాక భర్త, అత్త సైగలు చేస్తూ వారి అవసరాలు చెబుతుంటే... వాటిని తీర్చలేని దుస్థితిలో నారాయణమ్మ కంట నీరు పెట్టుకుని కుమిలిపోతోంది. సొంత పనులు కూడా చేసుకోలేక నిస్సహాయ స్థితిలో ప్రస్తుతం ఆ కుటుంబం కొట్టుమిట్టాడుతోంది. కుటుంబంలోని ముగ్గురూ పక్షవాతం బారిన పడి జీవచ్ఛవాల్లా ఉన్నారనే విషయం తెలుసుకున్న యాడికిలోని కమలపాడు రహదారిలో ఉన్న అగాపే వృద్ధాశ్రమ నిర్వాహకుడు ప్రసాద్ స్పందించారు. ప్రతి రోజూ ఉదయం టిఫిన్, మధ్యాహ్నం, రాత్రి భోజనాన్ని ఇంటి వద్దకే తీసుకెళ్లి దగ్గరుండి తినిపిస్తున్నారు. భయపడొద్దని, అండగా తానుంటానంటూ భరోసానిచ్చారు. ప్రసాద్ తప్ప ఇంకెవ్వరూ ఆ ఇంటి ఛాయలకు కూడా పోవడం లేదు. దీంతో నా అనే వారు ఎవరూ లేక ఆ కుటుంబం అనాథలా మారింది.

**ఆ కుటుంబాన్ని ఆదుకుంటా..**



పక్షవాతం బారిన పడి కుటుంబంలోని అందరూ మంచానపడడం చాలా బాధాకరం. మా వృద్ధాశ్రమంలో 30 మంది వరకు అనాథలు, వృద్ధులు ఉన్నారు. ప్రత్యేక షెడ్డు వేయించాల్సి ఉంది. షెడ్డు నిర్మాణం పూర్తికాగానే వీరిని కూడా ఆశ్రమానికి చేరుస్తా. నా ఊపిరి ఉన్నంత వరకూ నాగమ్మ కుటుంబాన్ని అన్ని విధాలుగా ఆదుకుంటా.

– ప్రసాద్, అగాపే వృద్ధాశ్రమ నిర్వాహకుడు, యాడికి

### నలుగురు ఎంపీఈఓలపై విచారణ



విచారణకు హాజరైన చిత్తూరు జిల్లా ఏడీఏలు, ఏఓలు

**అనంతపురం అగ్రికల్చర్:** జిల్లాకు చెందిన నలుగురు మల్టీ పర్పస్ ఎక్స్‌టెన్షన్ అసిస్టెంట్ల (ఎంపీఈఓ) అంశంపై అనంతపురంలోని సాయిల్ కన్సర్వేషన్ (ఎస్‌సీ) కార్యాలయంలో శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకూ విచారణ కొనసాగింది. జేడీఏ ఆదేశాల మేరకు విచారణాధికారిగా నియమితులైన ఎస్‌సీ డీడీఏ శివప్రసాద్ సారథ్యంలో ఐదారు మంది సభ్యులుగా ఉన్న బృందం లిఖిత పూర్వక వాంగ్మూలాలు, ఇతర డాక్యుమెంట్ల నకళ్లను తీసుకున్నారు. వ్యవసాయశాఖ పరిధిలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఎంపీఈఓలు ఎం.రాధిక, ఎస్.శివజ్యోతి, బి.లక్ష్మి, పి.భవ్యను 2022లో చిత్తూరు జిల్లాకు డిప్యుటేషన్‌పై బదిలీ చేశారు. వారు అక్కడ విధుల్లో చేరిన తర్వాత కొద్దిరోజులకు దీర్ఘకాలిక సెలవు పెట్టి ఏడాది క్రితం విధుల్లో చేరడానికి వెళితే... అటు చిత్తూరు జిల్లా ఇటు అనంతపురం జిల్లా అధికారులు తిరస్కరించినట్లు తెలుస్తోంది. విధుల్లోనూ చేరకపోవడమే కాక, దీర్ఘకాలిక సెలవులకు తమ అనుమతి లేనందున వారిని తిరిగి విధుల్లోకి తీసుకోవడం తమ చేతుల్లో లేదంటూ చిత్తూరు జిల్లా అధికారులు చేతులెత్తేసినట్లు చెబుతున్నారు. దీంతో తమకు న్యాయం చేయాలంటూ నలుగురు ఎంపీఈఓలు మూడు పర్యాయాలు కమిషనరేట్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఎట్టకేలకు ఈ అంశంపై విచారణకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ క్రమంలో విచారణకు హాజరు కావాలని చిత్తూరు జిల్లాకు చెందిన ముగ్గురు ఏడీఏలు, ఐదారు మంది ఏఓలతో పాటు బాధిత నలుగురు ఎంపీఈఓలకూ నోటీసులిచ్చారు. దీంతో వీరందరూ శుక్రవారం విచారణాధికారి బృందం ఎదుట హాజరై వివరణ ఇచ్చారు.

## ఏఎన్‌ఎంలకు ఇతర బాధ్యతలు అప్పగించరాదు

- కలెక్టర్‌కు ఏపీఎన్జీఓ సంఘం నేతల వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చేందుకు వచ్చిన ఏపీఎన్జీఓ సంఘం నాయకులు, సచివాలయ ఏఎన్‌ఎంలు

**అనంతపురం అర్బన్:** వైద్యారోగ్యశాఖకు సంబంధించి సచివాలయాల్లో పనిచేస్తున్న గ్రేడ్–3 ఏఎన్‌ఎంలకు ఇతర శాఖల సర్వేలు, పింఛన్ పంపిణీ తదితర శాఖేతర బాధ్యతలను అప్పగించరాదంటూ కలెక్టర్ వి.వినోద్‌కుమార్‌కు ఏపీఎన్జీఓ సంఘం నాయకులు, ఏఎన్‌ఎంలు విన్నవించారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను శుక్రవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖరరెడ్డి, కార్యదర్శి చంద్రమోహన్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ్, మహిళా విభాగం చైర్‌పర్సన్ జమీలా బేగం తదితరులు కలసి వినతిపత్రం అందజేసి, మాట్లాడారు. ఏఎన్‌ఎంలకు ఇతర శాఖల పనులు అప్పగించరాదంటూ ఈ ఏడాది జనవరి 23న ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులను పక్కాగా అమలు చేయాలని కోరారు. జాతీయ ఆరోగ్య మిషన్ కార్యక్రమాలకు సంబంధించి సేవలను లబ్ధిదారులకు నిర్దేశించిన సమయంలో అందించడంతో పాటు అదే రోజున ఆన్‌లైన్‌లో నమోదు చేయాల్సిన గురుతర బాధ్యత ఏఎన్‌ఎంలపై ఉందన్నారు. రోజువారీగా ఏఎంబీ, ఏఆర్ బర్త్ ప్లాన్, తదితర కార్యక్రమాలతో పాటు డ్రై డేలో భాగంగా ప్రతి శుక్రవారమూ ఇంటింటి కార్యక్రమం నిర్వహించాల్సి వస్తోందన్నారు. వివిధ కార్యక్రమాలతో ఇప్పటికే తలమునకలుగా ఉంటున్న ఏఎన్‌ఎంలకు సచివాలయాల పరిధిలో చేపట్టే అన్ని శాఖల సర్వేలు, పింఛన్ల పంపిణీ బాధ్యతలు అప్పగించడం బాధాకరమన్నారు. అన్ని కార్యక్రమాలు ఏకకాలంలో అమలు చేయాలని అధికారులు ఒత్తిడి చేస్తుండడంతో మానసికంగా ఆందోళనకు గురై అనారోగ్యం బారిన పడుతున్నారన్నారు. వీరి శ్రేయస్సును దృష్టిలో ఉంచుకుని ఏఎన్‌ఎం గ్రేడ్–3లను పూర్తిగా మాతృశాఖకు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో ఏపీఎన్జీఓ సంఘం కోశాధికారి ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, ఆర్గనైజింగ్ కార్యదర్శి లింగమేష్, సంయుక్త కార్యదర్శి జి.మహేశ్వర్‌రెడ్డి, ఇతర నాయకులు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అనుచరుల దౌర్జన్యం

- తాటాకు చప్పుళ్లకు భయపడేది లేదన్న ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి



సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్ సమక్షంలోనే విద్యార్థి సంఘం నేతలపై దౌర్జన్యం చేస్తున్న ఎంఎస్ రాజు అనుచరులు

**అనంతపురం రూరల్:** ప్రభుత్వ వసతి గృహాల్లో ఉంటున్న విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని అధికారులను కోరేందుకు వచ్చిన తమపై మడకశిర ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అనుచరులు దౌర్జన్యానికి దిగడం హేయమని ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి కుళ్లాయిస్వామి మండిపడ్డారు. ప్రభుత్వ ఎస్సీ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ పెన్నార్ భవన్‌లో ఉన్న జిల్లా సాంఘిక సంక్షేమ కార్యాలయం ఎదుట శుక్రవారం ఉదయం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో విద్యార్థులు ధర్నా నిర్వహించారు. ఆ సమయంలో ఎంఎస్ రాజు అనుచరులు అక్కడకు చేరుకుని విద్యార్థులు, ఏఐఎస్ఎఫ్ నాయకులపై దౌర్జన్యానికి దిగారు. అదే సమయంలో అక్కడకు సిబ్బందితో కలసి సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ చేరుకున్నారు. పోలీసుల సమక్షంలోనే విద్యార్థి సంఘం నేతలపై ఎమ్మెల్యే ఎంఎస్ రాజు అనుచరులు దూషణలకు దిగారు. టీడీపీ నేతల ఒత్తిళ్లకు తలొగ్గి పోలీసులు సైతం విద్యార్థులను భయభ్రాంతులకు గురి చేశారు. సీఐ రాజేంద్రనాథ్‌యాదవ్ ఆదేశాలతో విద్యార్థులను పెన్నార్ భవన్ ఆవరణ నుంచి పోలీసులు బలవంతంగా బయటకు గెంటేశారు. కుళ్లాయిస్వామి మాట్లాడుతూ... ఎస్సీ విద్యార్థుల సమస్యల పరిష్కారానికి తాము సాగిస్తున్న పోరాటానికి ఓ దళిత ఎమ్మెల్యే మద్దతు ఇవ్వకపోగా... తన అనుచరులతో దౌర్జన్యం చేయించడం బాధాకరమన్నారు. ఎమ్మెల్యే ఎంఎస్ రాజు తాటాకు చప్పుళ్లకు తాము భయపడబోమన్నారు. ప్రభుత్వ వసతి గృహాల్లో నెలకొన్న సమస్యలు పరిష్కారమయ్యే వరకూ పోరాటం సాగిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ నాయకులు నరసింహయాదవ్, వెంకట్ నాయక్, వంశి, చందు, మంజునాథ్ పాల్గొన్నారు.



### టీటీసీ థియరీ పరీక్షల వాయిదా

**అనంతపురం ఎడ్యుకేషన్:** వచ్చే నెల 6న జరగాల్సిన టీటీసీ థియరీ లోయర్ గ్రేడ్ పరీక్షలు వాయిదా పడ్డాయి. ఈ మేరకు డీఈఓ బి.వరలక్ష్మి శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఏపీ టెట్ పరీక్షల కారణంగా వాయిదా వేసిన టీటీసీ థియరీ లోయర్ గ్రేడ్ పరీక్షలను అక్టోబర్ 27న నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

### కేజీబీవీలో డీఈఓ తనిఖీలు



విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈఓ మీనాక్షి

**రొద్దం:** స్థానిక కేజీబీవీని డీఈఓ మీనాక్షి శుక్రవారం సాయంత్రం తనిఖీ చేశారు. పాఠశాలలో మౌలిక సదుపాయలపై ఆరాతీశారు. సమస్యలపై విద్యార్థులతో చర్చించారు. అనంతరం పాఠశాల ఆవరణలో విద్యార్థులు ఏర్పాటు చేసిన గార్డెన్‌ను పరిశీలించి అభినందించారు.

**నాణ్యమైన విద్యను అందించండి : డీఈఓ**

**అమరాపురం:** కేజీబీవీ విద్యార్థులకు నాణ్యమైన అందించాలని డీఈఓ మీనాక్షి ఆదేశించారు. శుక్రవారం రాత్రి హలుకూరు సమీపంలోని కేజీబీవీని జీసీడీఓతో కలసి ఆమె తనిఖీ చేశారు. భోజనంలో నాణ్యతను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించేలా ఇప్పటి నుంచే ప్రణాళికబద్ధంగా బోధన చేపట్టాలని ప్రిన్సిపాల్ శోభారాణికి సూచించారు.

### యువకుడి ఆత్మహత్య

**కదిరి అర్బన్:** జీవితంపై విరక్తితో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... కదిరి మండలం యర్రదొడ్డి గ్రామానికి చెందిన ఉదయ్‌కుమార్ (31)పై హైదరాబాద్‌లో పోక్సో కేసులు నమోదై ఉన్నాయి. ఈ క్రమంలో యర్రదొడ్డి గ్రామ శివారులో శుక్రవారం ఉదయం చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. కాగా, తన కుమారుడి మృతికి పోలీసుల వేధింపులే కారణమంటూ తండ్రి రామకృష్ణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు సీఐ నారాయణరెడ్డి కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. విషయం తెలుసుకున్న కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్... ఆ గ్రామానికి చేరుకుని బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు.

### రెండు దుకాణాల్లో చోరీ

**గోరంట్ల:** స్థానిక స్టేట్ బ్యాంక్ సమీపంలో గురువారం రాత్రి రెండు దుకాణాల్లో చోరీ జరిగింది. పోలీసులు, బాధితులు తెలిపిన మేరకు... అబ్జల్‌కు చెందిన గిఫ్ట్ మెటీరియల్ దుకాణంలోకి చొరబడిన దుండగులు రూ.5 వేల నగదు, రూ.70 వేల విలువైన గిఫ్ట్ సామగ్రిని పట్టుకెళ్లారు. అలాగే షాకీర్‌కు చెందిన దుస్తుల దుకాణంలో రూ.55 వేల నగదు, రూ.25 వేలు విలువ చేసే దుస్తులు, ఓ ఐఫోన్‌ను అపహరించారు. ఆయా ఘటనలపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

## ప్రకృతి వ్యవసాయం లాభదాయకం

- జిల్లా రైతులంతా దృష్టి సారించాలి
- వ్యవసాయశాఖ అధికారి వైవీ సుబ్బారావు



ప్రకృతి వ్యవసాయ పద్ధతులతో సాగు చేసిన పత్తి పంటను పరిశీలిస్తున్న డీఏఓ సుబ్బారావు

**మడకశిర రూరల్:** ఎలాంటి రసాయనాలు వాడని ప్రకృతి వ్యవసాయం రైతులకు లాభదాయకమని, రైతులంతా దృష్టి సారించాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి వైవీ సుబ్బారావు సూచించారు. శుక్రవారం ఆయన మడకశిర మండలంలోని జిల్లేడుగుంటలో రైతు విశ్వనాథ్ ప్రకృతి వ్యవసాయం పద్ధతుల ద్వారా సాగు చేసిన పత్తి పంటను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ, ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో వాడే ఘన, ద్రవ, జీవామృతం ఉపయోగించడం వల్ల భూసారం పెరుగుతుందని, తద్వారా అధిక దిగుబడులూ సాధ్యమవుతాయన్నారు. పత్తితో పాటు అంతర పంటలను సాగు చేసి ఆదాయం పొందాలన్నారు. డీఏఓ వెంట వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు కృష్ణమీనన్, ఏఓ తిమ్మప్ప, ఏపీసీఎన్ఎఫ్ ఏఓ కృష్ణ చైతన్య, మాస్టర్ ట్రైనర్ రమేష్, రైతు సేవా కేంద్రం సిబ్బంది ఉన్నారు.

**పంటమార్పిడితో ప్రయోజనం..**

**అగళి:** పంటమార్పిడితో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని జిల్లా వ్యవసాయ అధికారి వైవీ సుబ్బారావు తెలిపారు. శుక్రవారం ఆయన మండలంలోని అగళి, నరసబుంది గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ.. అంతరపంటలతో అదనపు ఆదాయం లభిస్తుందని రైతులకు తెలిపారు. అనంతరం మండలంలో సాగైన పంటల వివరాలను మండల వ్యవసాయ అధికారి శేఖర్ నాయక్‌ను అడిగి తెలుసుకున్నారు.

**ఈ–కేవైసీని వేగవంతం చేయండి..**

**రొళ్ల:** జిల్లాలో ఈ–కేవైసీ మందకొడిగా సాగుతోందని, వెంటనే వేగవంతం చేయాలని జిల్లా వ్యవసాయాధికారి వైవీ సుబ్బారావు సిబ్బందిని ఆదేశించారు. రెండు మూడు రోజుల్లోపు ఈ–కేవైసీ పూర్తి చేయించడానికి వ్యవసాయశాఖ సిబ్బంది చొరవ చూపాలన్నారు. శుక్రవారం ఆయన మండలంలోని మండలంలోని హులికుంటలో పర్యటించారు. గ్రామానికి చెందిన మహిళ రైతు లక్ష్మమ్మతో ఈ–కేవైసీ చేయించారు. అనంతరం రైతు కిట్టప్ప వర్షాధారం కింద మెట్ట ప్రాంతలో సాగు చేసిన వేరుశనగ, రాగి పంటను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ, ఈ ఖరీఫ్‌లో పంటలు సాగుచేయని వారు ప్రత్యామ్నాయ పంటలు సాగుచేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. డీఏఓ వెంట ఏఓ రాజ్యలక్ష్మి, ఏఈఓ చంద్రకళ, వీఏఏ లలిత, రైతులు తదితరులు ఉన్నారు.

## అన్నదాతపై సీఐ యుగంధర్ జులుం



బాధిత రైతు బంగారు శ్రీనివాసరెడ్డి

**పామిడి:** అన్నదాతపై పామిడి సీఐ యుగంధర్ విరుచుకుపడ్డాడు. ఏడు పదుల వయసులో ఉన్న రైతుపై ఏకంగా బెల్ట్‌తో దాడి చేసి వివాదానికి తెర లేపాడు. ఘటనపై బాధిత రైతు ఆవేదన ఆయన మాటల్లోనే...

'నా పేరు బంగారు శ్రీనివాసరెడ్డి. పి.కొత్తపల్లి గ్రామానికి చెందిన నేను 2002లో పామిడిలోని గుండప్పరావు కాలనీ లే ఔట్‌లో 170, 171, 172 నంబర్ల ప్లాట్లను కొనుగోలు చేసి నా భార్య బి.లక్ష్మి పేరుతో రిజిస్టర్ చేయించా. అదే రోజే అదే సర్వే నంబర్‌లోని 73, 74 ప్లాట్లలో మొత్తం 3 సెంట్ల స్థలానికి రూ.54వేలు ధరను లేఔట్ నిర్వాహకులు యు.సతీష్ కుమార్, యు.నరేంద్రకుమార్ (అన్నదమ్ములు) నిర్ణయించడంతో వాటికి కూడా అదే రోజు రూ.5 వేలు అడ్వాన్స్ చెల్లించి మూడేళ్లలోపు రిజిస్టర్ చేయించుకుంటానని అగ్రిమెంట్ చేయించుకున్నా. ఒప్పందం మేరకు మూడేళ్ల తర్వాత రిజిస్ట్రేషన్ చేయించాలని కోరితే బకాయి రూ.49వేలకు రూ.2 వడ్డీ చొప్పున చెల్లించాలని లేఔట్ నిర్వాహకులు డిమాండ్ చేస్తే అందుకూ ఒప్పుకున్నా. అదే సమయంలో అన్నదమ్ముల మధ్య మనస్పర్థలు తలెత్తడంతో రిజిస్ట్రేషన్ కాస్త ఆగిపోయింది. దీంతో అప్పటి సీఐ చొరవతో అన్నదమ్ములను నేనే దగ్గరుండి రాజీ చేయించినా స్థలాన్ని రిజిస్టర్ చేసివ్వకుండా వచ్చారు. దీనిపై న్యాయం చేయాలని కోరుతూ గత సోమవారం ఎస్పీని ప్రజా సమస్యల పరిష్కార వేదికలో కలసి వినతి పత్రం ఇచ్చా. దీనిపై ఎస్పీ సూచన మేరకు గురువారం సాయంత్రం పామిడిలో సీఐ యుగంధర్‌ను కలిశా. నన్ను చూడగానే ఆయన ఒక్కసారిగా ఊగిపోయారు. తనను కాదని ఎస్పీని కలిసినందుకు బూతులతో విరుచుకుపడి నా వద్ద ఉన్న అగ్రిమెంట్‌ను లాక్కొని చించి అవతల పడేశాడు. నా సెల్ లాక్కొన్ని నేలకేసి కొట్టాడు. వయసులో పెద్దవాడినని కూడా చూడకుండా చెంపపై బలంగా కొట్టి, బెల్ట్ తీసి చితకబాదాడు'.

**బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడు**

22 ఏళ్ల నాటి అగ్రిమెంట్ తెచ్చి న్యాయం చేయాలంటే అగ్రిమెంట్ చెల్లుబాటు కాదని నచ్చ చెప్పి పంపాను. ఆయనను తిట్టింది లేదు. కొట్టింది లేదు. కావాలనే బ్లాక్‌మెయిల్ చేస్తున్నాడు.

– యుగంధర్, సీఐ

### రాష్ట్ర స్థాయి పోటీలకు జిల్లా అథ్లెట్ల ఎంపిక

**అనంతపురం:** ఎస్‌జీఎఫ్ ఆధ్వర్యంలో త్వరలో శ్రీకాకుళం జిల్లాలో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్‌లో పాల్గొనే క్రీడాకారులను శుక్రవారం అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఎంపిక చేశారు. అండర్–17 బాల, బాలికల 100 మీటర్ల పరుగులో టి. రాజేష్, కె.ముఖేష్, హెచ్ అర్చన, ఎస్.లక్ష్మి, 200 మీటర్ల పరుగులో డి.హరిశంకర్, డి.శశికాంత్, జి.యశస్విని, ఎ.ఇంద్రలేఖ, 400 మీటర్ల పరుగులో హరిశంకర్, టి.రాజేష్, ఇంద్రలేఖ, సి.ఉదయశ్రీ, 3వేల మీటర్ల పరుగులో యశ్వంత్, పవన్, డి.సమీరా, హరిణి ఎంపికయ్యారు. లాంగ్‌జంప్‌లో జి. యశస్విణి, ఆర్.మానస, డి.నరసింహారెడ్డి, సుదర్శన్, హై జంప్‌లో డి.హర్ష, ఎం.వాణి, వి.సిద్ధార్థ, వై.బన్నీ, షార్ట్‌పుట్‌లో వి.సరస్వతి, రమ్యశ్రీ, డి.వసంత్, బి.దేవేంద్రనాయక్, 5వేల మీటర్ల పరుగులో హేమంత్‌కుమార్, మధు, 3 వేల మీటర్ల (నడక) పి. మౌనిక, హెచ్.వర్షిత, 800 మీటర్ల పరుగులో లాస్యరెడ్డి, ఉదయశ్రీ ఎంపికయ్యారు.